

ఆర్డర్లు లేవని కొనుగోళ్లకు బ్రేక్

దేశీయ, విదేశీ ఆర్డర్లు లేవంటూ ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు మిర్చి కొనుగోళ్లను నిలిపివేశారు. 8లో



కసాయితల్లికి జీవితఖైదు

మామతో వివాహేతర సంబంధం పెట్టుకున్న ఓ మహిళ, ఆమె బిడ్డను హత్య చేయగా.. ఇద్దరికీ జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. 8లో

గరిష్ఠం / కనిష్ఠం 31°/ 24°

వాతావరణం

జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. పలు ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో అదనపు కలెక్టర్ తనిఖీ



ఉద్యోగులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కొణిజర్ల: అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సోమవారం సాయంత్రం కొణిజర్ల మండలంలోని పలు గురుకులాలను తనిఖీ చేశారు. అమ్మపాలెంలోని మైనార్టీ బాలురు గురుకుల పాఠశాల, జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకులాలను తనిఖీ చేసిన ఆమె వసతి, వంట గదులు, మెస్‌లను పరిశీలించడమే కాక వంట తయారీకి ఉపయోగిస్తున్న సరుకుల నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థులకు ఉత్తమ బోధనతో పాటు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ప్రిన్సిపాళ్లు బి.నాగమణి, జితేష్ సాహిల్, ఉద్యోగులు సీహెచ్.రంజిత్, నిర్మల, యాకూబ్‌పాషా, తులసి పాల్గొన్నారు.

కేఎంసీ కమిషనర్..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య సోమవారం పలు గురుకులాలను తనిఖీ చేశారు. అక్కడ విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలపై ఆరా తీయడమే కాక, అవసరమైన సామగ్రి, తాగునీరు, విద్యుత్ సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచించారు.

రేషన్ లబ్ధిదారులు ఈ కేవైసీ చేయించుకోవాలి

ఖమ్మం సహకారనగర్: రేషన్ కార్డుదారులంతా రేషన్ షాపుల్లో ఈ కేవైసీ చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ సూచించారు. జిల్లాలో 4,15,905 కార్డులకు 12,03,943 మంది లబ్ధిదారులు ఉన్నారని తెలిపారు. వీరిలో 9,64,236 మంది మాత్రమే ఈ కేవైసీ చేయించుకున్న నేపథ్యాన మిగతా వారు కూడా ముందుకు రావాలని తెలిపారు. కాగా, హోటళ్లు, హాస్టళ్లలో గృహోపయోగ గ్యాస్ సిలిండర్లను వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని డీసీఎస్‌ఓ హెచ్చరించారు. ఖమ్మంలోని పలు ప్రాంతాల్లో సోమవారం చేపట్టిన తనిఖీల్లో సిలిండర్లు స్వాధీం చేసుకుని బాధ్యులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

నేటితో ముగియనున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ మంగళవారం ముగియనుంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో గత వారం రోజులుగా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. ఈ కౌన్సెలింగ్ మంగళవారం ముగియనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ చందా సుధాకర్ తెలిపారు. కాగా, సోమవారం 800 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 760మంది హాజరయ్యారని వెల్లడించారు.

గెజిటెడ్ అధికారులకే 'స్వగృహ' ఫ్లాట్లు


ఖమ్మం సహకారనగర్: తొలుత నిర్ణయించినట్లుగా గెజిటెడ్ అధికారులకే మాత్రమే రాజీవ్ స్వగృహ సముదాయంలో ఫ్లాట్లు ఇవ్వనున్నామని టీజీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని టీజీవోస్ భవన్‌లో జరిగిన సొసైటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల హౌస్ బిల్డింగ్ సొసైటీలో ఉమ్మడి జిల్లా నుంచి ఇప్పటి వరకు 1,012మంది సభ్యులుగా చేరారని తెలిపారు. ఇందులో పలువురు బ్యాంక్‌లో నగదు డిపాజిట్ చేశారని చెప్పారు. ఈనెల 10వ తేదీలోపు అందరూ డిపాజిట్ చేయాలని సూచించారు. ఈసమావేశంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు కట్టా కిషోర్, విజయ్‌కుమార్, టీజీవోస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కస్తాల సత్యనారాయణ, మోదుగు వేలాద్రితో పాటు శేషుప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్యకు ముత్తంగి అలంకరణ

భద్రాచలం: భద్రాచలంలో శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం అనంతరం స్వామివారికి కంకణ ధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

భగీరథ ప్రయత్నం!





పంప్ హౌస్ నిర్మించనున్న ప్రాంతం ఇదే (ఇన్‌సెట్) ప్రాజెక్టు నమూనా

'జవహర్' ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అడుగులు

- 4.66 టీఎంసీల నీరు సాగర్ కాల్వలకు తరలింపు
- రూ.630.30 కోట్ల వ్యయంతో నిర్మాణానికి ప్రణాళిక
- మధిర, ఎర్రుపాలెం మండలాల్లో చివరి ఆయకట్టుకు భరోసా

మధిర: పూర్తిగా వ్యవసాయాధారిత ప్రాంతమైన మధిర నియోజకవర్గంలోని మధిర, ఎర్రుపాలెం మండలాలు సాగర్ ఆయకట్టు కింద జోన్-3లో ఉన్నాయి. దీంతో ప్రాజెక్టు నుంచి ఏపీకి నీరు వెళ్లాక అక్కడి నుంచి ఈ మండలాలకు చేరేలోగా విడుదల నిలిపివేస్తుండడంతో ఆయకట్టు రైతులు నష్టపోతున్నారు. ఈనేపథ్యాన మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించగా ఈ పరిధిని జోన్-3 నుంచి జోన్-2కు మార్పు చేయించారు. అంతేకాక మధిర, ఎర్రుపాలెం మండలంలోని సుమారు 33వేల ఎకరాలకు సాఫీగా నీరు అందేలా జవహర్ ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. త్వరలోనే శంకుస్థాపన చేయనున్న ఈ పథకం ద్వారా రెండు మండలాల రైతుల ఇక్కట్లు తీరనున్నాయి.

ఇదీ ప్రాజెక్టు స్వరూపం

మధిర మండలంలోని వంగవీడు సమీపాన వైరా నదిపై చెక్‌డ్యాం నిర్మిస్తారు. అక్కడ జవహర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని చివరి భూములకు సాగునీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటికే ఎత్తిపోతల పథకానికి రూ.630.30 కోట్ల నిధులు మంజూరు చేయగా, ఈ ప్రాజెక్టు కింద మధిర, ఎర్రుపాలెం మండలాల్లోని సాగర్ ఆయకట్టును స్థిరీకరిస్తారు. ఇందుకోసం 250ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. కాగా, ఈ ప్రాజెక్టును ఏడాదిన్నర కాలంలో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

పైప్‌లైన్ల ఏర్పాటు

వంగవీడు దగ్గర పంప్‌హౌస్ నుంచి మొదటి పైప్‌లైన్ ద్వారా11 కి.మీ. దూరంలోని నిధానపురం మేజర్‌లోకి నీరు ఎత్తిపోస్తారు. దీంతో మధిర మండలంలోని 17,309 ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీరు అందుతుంది. ఈ జాబితాలో మధిర మండలంలోని అంబారుపేట, చిలుకూరు, దెందుకూరు, ఇల్లందులపాడు, ఖమ్మంపాడు, మధిర, మాటూరు, నాగవరప్పాడు, నిధానపురం, సైదల్లిపురం, సిద్ధినేనిగూడెం, తొండల గోపవరం, తొర్లపాడు గ్రామాలు ఉన్నాయి. అలాగే, 2, 3వ పైప్‌లైన్ల ద్వారా ఎర్రుపాలెం మండలంలోని మైలవరం, జమలాపురం మేజర్ కాల్వల్లోకి నీటిని లిఫ్ట్ చేస్తారు. మైలవరం మేజర్ కెనాల్ ద్వారా 5,093 ఎకరాలకు, జమలాపురం కెనాల్ ద్వారా 10,623 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. తద్వారా రెండు మండలాల్లోని 33,025 ఎకరాల చివరి భూములకు సైతం సాగునీరు సాఫీగా అందనుంది. ఈ భూములు ఎర్రుపాలెం మండలంలోని రాజుపాలెం, రంగగూడెం, తాటిగూడెం, త్రిపురవరం, రేమిడిచర్ల, కేసిరెడ్డిపల్లి, జమలాపురం, ఎర్రుపాలెం, గుంటుపల్లి గోపవరం, భీమవరం, అయ్యవారిగూడెం, మామునూరు, చొప్పకట్లపాలెం, బనిగండ్లపాడు, పెద్ద గోపవరం, పెగ్గళ్లపాడు, ఇనగాలి గ్రామాల్లో ఉన్నాయి.

ఎత్తిపోతలు ఇలా...

సీతారామ ఎత్తిపోతల పథకం నుంచి రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా 590 క్యూసెక్కుల నీటిని మధిర బ్రాంచ్ కెనాల్‌కు 51వ కిలోమీటర్ వద్ద ఎన్నెస్పీ కెనాల్‌లో ఎత్తిపోస్తారు. ఆ తర్వాత 51.7వ కిలోమీటర్ వద్ద తూము నిర్మించి ఒక ఫీడర్ కెనాల్ ద్వారా వైరా నదికి తరలిస్తారు (రిజర్వాయర్ దిగువకు). అలా వచ్చిన నీటిని వంగవీడు దగ్గర నిర్మించే చెక్ డ్యాం వద్ద నిల్వ చేస్తారు. ఆపై అక్కడ నిర్మించనున్న పంప్ హౌస్‌లోని మూడు పైప్‌లైన్ల ద్వారా రెండు మండలాలకు నీటిని తరలిస్తారు.

మా కష్టాలు తీరతాయి...



సాగర్ కెనాల్ ద్వారా మధిర, ఎర్రుపాలెం మండలాలకు నీరు రావడం లేదు. రెండు, మూడేళ్లకోసారి కూడా నీరు అందక పంటలు నష్టపోతున్నాం. ఇప్పుడు మా గ్రామ సమీపాన నిర్మించే ఎత్తిపోతల పథకం పూర్తయితే ఇక్కడి రైతుల కష్టాలు తీరతాయి.

– ఐలూరి సత్యనారాయణరెడ్డి, రైతు వంగవీడు

నష్టాలు ఎదురుకావు..



మేజర్ జోన్-3 చివరలో నిధానపురం ఉంటుంది. కాల్వకు సాగర్ నీరు రాకపోవడంతో ఇబ్బందిగా ఉంది. రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన పంటలకు చివరలో నీరు అందక ఎండిపోతున్నాయి. లిఫ్ట్ పూర్తయితే మూడు పంటలు పండించి నష్టాలను అధిగమిస్తాం.

– చావలి బాలరాజు, రైతు నాగవరప్పాడు

ప్రజావాణిపై విశ్వాసం పెరగాలి..

కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

ఖమ్మం సహకారనగర్: ప్రజలు అందించే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా ప్రజావాణి(గ్రీవెన్స్ డే)పై విశ్వాసం పెంపొందించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో భాగంగా అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాసరెడ్డితో కలిసి ఆయన ఫిర్యాదులు, వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2025 జనవరి నుండి ఇప్పటి వరకు పెండింగ్ ఉన్న185 దరఖాస్తులను వారంలోగా పరిష్కరించాలన్నారు. అలాగే, జిల్లా అధికారులు ప్రతీ వారం మండలాల వారీగా ప్రజావాణి దరఖాస్తులపై సమీక్షించాలని సూచించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌ఓ ఏ.పద్మశ్రీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కాగా, ఖమ్మం అర్బన్ మండలం వినోబా(నవోదయ) కాలనీలో కోర్టు ఉత్తర్వుల మేరకు తాగునీరు, కరెంట్ వంటి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అలాగే, గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గంలో వైరా మండలం గండగలపాడు వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటుచేయాలని, హైవే నిర్మాణంతో దెబ్బతిన్న సాగునీటి కాల్వలను పునరుద్ధరించాలని తెలంగాణ రైతు సంఘం నాయకులతో కలిసి రైతులు వినతిపత్రం అందజేశారు. ఇవి కాక ఇంకొన్ని అంశాలు వినతిపత్రాలు, ఫిర్యాదులు అందాయి.

ఓపెన్ స్కూల్ బుక్‌లెట్ల ఆవిష్కరణ

తెలంగాణ ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలపై అవగాహన కల్పించేలా రూపొందించిన బుక్‌లెట్లను కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు, వయోజన విద్య డీడీ అనిల్, డీఈఓ కార్యాలయ ఉద్యోగి చావా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే, ప్రైవేట్ కాలేజీలో ఫార్మసీ చదువుతున్న వేగినాటి దీపిక ఫీజు కోసం హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యుడు మద్దినేని ప్రసాదరావు కమల సమకూర్చిన రూ.35 వేల చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. ఈకార్యక్రమంలో యలమద్ది వెంకటేశ్వర్లు, సిరిపురపు రమణారావు, కొంగర పురుషోత్తమరావు, ఏపూరి నాగేశ్వరరావు, మద్దినేని కమల తదితరులు పాల్గొన్నారు.

పైలట్‌గా 15 పాఠశాలలు

జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి ఆదర్శంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి అధికారులతో సమీక్షించిన ఆయన 15 పాఠశాలలను ఎంపిక చేసి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో సమన్వయం చేసుకుంటూ పనులు చేపట్టాలన్నారు. ఇందుకోసం రూ.12 కోట్ల సీఎస్‌ఆర్ నిధులు కేటాయిస్తామని తెలిపారు. ఇక మధిరలో జీ+2 విధానంలో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేలా ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ సూచించారు. అక్కడ 13 ఎకరాల స్థలంలో 427 ఇళ్ల నిర్మాణంపై దృష్టి సారించాలని తెలిపారు. జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ పాల్గొన్నారు.

దరఖాస్తు.. అక్కడికక్కడే మంజూరు



శైజలకు ఇంటి పట్టా అందిస్తున్న కలెక్టర్

ఇంటి కోసం నిరుపేద కుటుంబం అందించిన దరఖాస్తును కలెక్టర్ అనుదీప్ అక్కడికక్కడే పరిష్కరించారు. ముస్తఫానగర్‌కు చెందిన తుపాకుల శైలజకు 2022లో వైఎస్సార్ కాలనీలోని డబుల్ బెడ్‌రూమ్ సముదాయంలో ఇల్లు కేటాయించినా అనారోగ్య కారణాలతో తీసుకోలేదు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించగా కలెక్టర్ పరిశీలించారు. అక్కడికక్కడే అల్లీపురంలోని డబుల్ బెడ్ రూమ్ సముదాయం డీ3 బ్లాక్‌లో ఖాళీగా ఉన్న జీ1 ఇంటిని శైలజకు కేటాయిస్తూ ధ్రువపత్రం అందించగా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇంకా అందని యూనిఫామ్



ఎర్రుపాలెం జెడ్పీహెచ్ఎస్‌లో యూనిఫామ్ లేని ఆరో తరగతి విద్యార్థులు

- 7–10వ తరగతి విద్యార్థులకు ఒకటే జత పంపిణీ
- ఆరో తరగతి విద్యార్థులకు అదీ అందని వైనం

ఎర్రుపాలెం: విద్యార్థులు అంతా సమానమేనన్న భావనతో ఉండేలా ప్రభుత్వం యూనిఫామ్ పంపిణీ చేస్తోంది. కానీ ఆచరణలో ఇది సాఫీగా సాగడం లేదు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల కావొస్తున్నా చాలా మంది విద్యార్థులకు ఒకే జత యూనిఫాం అందగా.. ఇంకొందరికి అది కూడా పంపిణీ చేయకపోవడంతో ఒక్కో పాఠశాలలో విద్యార్థులు కొందరు యూనిఫామ్‌తో, ఇంకొందరు సాధారణ దుస్తుల్లో హాజరవుతున్నారు. జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలు 1,269 ఉండగా, వీటిలో 69,241 మంది చదువుతున్నారు. వీరందరికీ రెండు జతల యూనిఫామ్ అందించేలా క్లాత్‌ను మండలాలకు సరఫరా చేశారు. ఇప్పటివరకు జిల్లాలోని 66,868 మందికి ఒకే జత యూనిఫామ్ పంపిణీ పూర్తయిందని అధికారులు చెబుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఆ పరిస్థితి కనిపించడం లేదు.

ఉతికితేనే యూనిఫామ్

జిల్లాలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులకు ఒక జత యూనిఫామ్ కూడా నేటికీ అందలేదని తెలుస్తోంది. కొన్ని చోట్ల 7నుంచి 10వ తరగతుల వారికి ఒక జత అందించగా, ఆరో తరగతి విద్యార్థులకు అదీ పంపిణీ చేయలేదు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 3వేల మందికి పైగా విద్యార్థులు ఆరో తరగతిలో కొత్తగా చేరినట్లు అంచనా. కొలతలు తీసుకోలేదని చెబుతూ వీరికి యూనిఫామ్ ఇవ్వలేదని తెలుస్తోంది. ఇక ఒకటే జత అందుకున్న విద్యార్థులు ఏ రోజుకారోజు ఉతికితేనే తెల్లారి పాఠశాలలకు యూనిఫామ్‌తో వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

నగదు తక్కువ కావడంతో..

యూనిఫామ్ కుట్టించే బాధ్యతను మహిళా సమాఖ్యలకు అప్పగించారు. సమాఖ్యల్లోని సభ్యులకు టైలరింగ్ వస్తే యూనిఫామ్ సొంతంగా కుడుతున్నారు. ఆ పరిస్థితి లేని చోట స్థానిక టైలర్లతో కుట్టిస్తున్నారు. ఒక జత యూనిఫామ్ కుట్టినందుకు ప్రభుత్వం రూ.70 చెల్లిస్తుండడంతో ఆ నగదు సరిపోదనే భావనతో టైలర్లు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఈ కారణంగా రెండో జత యూనిఫామ్ పంపిణీలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఇకనైనా మండలస్థాయి కమిటీల్లో సభ్యులైన తహసీల్దార్, ఎంఈఓ, ఐకేపీ ఏపీఎంలు దృష్టి సారిస్తేనే సమస్యకు పరిష్కారం లభించనుంది.

ఒకరికే యూనిఫామ్



మా ఇద్దరు కుమారులు మీనవోలు స్కూల్‌లో ఏడు, ఆరో తరగతి చదువుతున్నారు. ఏడో తరగతి చదివే కుమారుడికి ఒక జత యూనిఫామ్ ఇవ్వగా, చిన్నకుమారుడికి అసలే ఇవ్వలేదు. దీంతో నాకెందుకు ఇవ్వలేదని అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నాం.

– గుర్రాల వెంకటేశ్వరరెడ్డి, జెడ్పీ పాఠశాల పేరెంట్, మీనవోలు

మా స్కూల్‌కు యూనిఫాం రాలేదు..



మా పాఠశాలలోని 70 మంది విద్యార్థులకు ఒక జత కూడా యూనిఫామ్ రాలేదు. మహిళా సమాఖ్యలో అడిగితే కుట్టడం కాలేదని చెప్పారు. దీంతో యూనిఫామ్ కోసం తల్లిదండ్రులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ విషయాన్ని అధికారులకు దృష్టికి తీసుకెళ్లాం.

– జంగా గురునాథరెడ్డి, పీఎస్(బీసీ కాలనీ) హెచ్‌ఎం, బనిగండ్లపాడు

15న నాటికి రెండో జత



జిల్లాలోని విద్యార్థులందరికీ 15వ తేదీ నాటికి రెండో జత యూనిఫామ్ ఇస్తాం. ఇప్పటికే యూనిఫామ్ కుట్టడం 30శాతం పూర్తయింది. ఈ ఏడాది ఆరో తరగతిలో చేరిన విద్యార్థుల కొలతలు తీసుకుంటున్నాం. వీరికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తాం.

– సామినేని సత్యనారాయణ, డీఈఓ

వన మహోత్సవానికి రెడీ..

- శాఖల వారీగా మొక్కలు నాటడానికి ఏర్పాట్లు
- 35.23 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ
- ఎంపిక చేసిన ప్రాంతాల్లో బ్లాక్ ప్లాంటేషన్ కూడా..



వెలుగుమట్ల పార్క్‌లోని నర్సరీలో మొక్కలు

ఖమ్మంవ్యవసాయం: మానవ మనుగడ, పర్యావరణ పరిరక్షణ, సమతుల్యతకు మొక్కల పెంపకం కీలకంగా నిలుస్తుంది. ఈనేపథ్యాన ప్రభుత్వం ఏటా మాదిరిగానే ఈసారి వన మహోత్సవం పేరిట కార్యక్రమ నిర్వహణకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది పది ప్రభుత్వ శాఖలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. అటవీ శాఖతో పాటు జిల్లా గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, ఉద్యాన, పట్టు పరిశ్రమ, ఎక్సైజ్, మున్సిపల్, విద్యాశాఖతో పాటు పరిశ్రమలు, గనులు, భూగర్భ శాఖలకు కార్యక్రమ నిర్వహణ బాధ్యత అప్పగించారు. ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్న నేపథ్యాన మొక్కలు నాటడం మొదలుపెట్టి ఆగస్టు మొదటి వారానికి పూర్తి చేయాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ప్రణాళిక రూపొందించింది.

అటవీ శాఖ ద్వారా 5.47లక్షలు

ఈ ఏడాది వన మహోత్సవంలో జిల్లా అంతటా కలిపి 35,23,300 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఇందులో అటవీ శాఖ తరఫున ఖమ్మం డివిజన్ నుంచి 2,47,200, సత్తుపల్లి డివిజన్‌లో 3లక్షలు మొక్కలు నాటాల్సి ఉంది. రిజర్వ్ ఫారెస్ట్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో ఈ మొక్కలు నాటుతారు. అలాగే, మున్సిపల్ శాఖ ద్వారా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 3,08,920 మొక్కలు నాటనున్నారు. అంతేకాక మధిర, సత్తుపల్లి మున్సిపాలిటీల్లో 2,41,740 చొప్పున, కల్లూరులో 65వేలు, వైరాలో 50వేలు, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 40వేల మొక్కలు నాటాల్సి ఉంటుంది. ఇంకా మిగతా శాఖలకు కూడా లక్ష్యాలను కేటాయించారు.

మూడు చోట్ల బ్లాక్ ప్లాంటేషన్

జిల్లాలోని పలు ప్రాంతాల్లో బ్లాక్ ప్లాంటేషన్ పేరిట ఒకే చోట ఎక్కువ సంఖ్యలో మొక్కలు నాటాలని నిర్ణయించారు. అటవీ శాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం చేపడుతారు. ఎంపిక చేసిన ప్రాంతంలో పెద్దసంఖ్యలో నాటి సంరక్షించడం ద్వారా చిట్టడివి మాదిరి తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ లక్ష్యం. ఇందుకోసం రఘునాథపాలెం మండలంలో 15 ఎకరాలు, తిరుమలాయపాలెం మండలంలో ఐదు నుంచి ఏడు ఎకరాలు గుర్తించగా, పులిగుండాల వద్ద ఎకోటూరిజంలో భాగంగా 25 ఎకరాల్లో 11,100 మొక్కలు నాటనున్నారు.

సిద్ధంగా మొక్కలు

వన మహోత్సవం కార్యక్రమానికి అవసరమైన మొక్కలు నర్సరీల్లో సిద్ధంగా ఉన్నాయి. గ్రామీణాభివృద్ధి సంస్థ, పంచాయతీరాజ్, అటవీ శాఖలు ఎన్‌ఆర్‌ఈజీఎస్, హరితనిధి వంటి పథకాల ద్వారా నర్సరీలు నిర్వహిస్తున్నాయి. ఈసారి నీడ, పండ్లు, పూలను ఇచ్చే మొక్కలే కాక ఔషధ మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు చింతచెట్లు, ఈత చెట్లు, చందనం వృక్షాలే కాక నేరేడు, జామ, సీతాఫలం, దానిమ్మ వంటి పండ్ల మొక్కలతో పాటు ఉసిరి, మునగ, గానుగ, నారవేప, రావి, మర్రి, వేప వంటి మొక్కలు సిద్ధం చేశారు.

విద్యార్థుల భాగస్వామ్యం..



ఈ ఏడాది వన మహోత్సవంలో విద్యార్థులను ఎక్కువగా భాగస్వామ్యం చేయనున్నాం. ప్రభుత్వ శాఖలతో పాటు వన సంరక్షణ సమితి సభ్యులు, ప్రజలను కలుపుకుంటూ మొక్కలు నాటుతాం. ఇప్పటికే నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉన్నందున త్వరలోనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం.

– సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, జిల్లా అటవీ అధికారి

ప్రభుత్వ శాఖల వారీగా నాటనున్న మొక్కలు

ప్రభుత్వ శాఖ	డీఆర్‌డీఓ	మున్సిపల్ శాఖ	అటవీ శాఖ	వ్యవసాయ శాఖ
లక్ష్యం	11,54,800	9,47,400	5,47,200	3,44,800

ఉద్యాన, పట్టుపరిశ్రమ	సింగరేణి	ఎక్సైజ్ శాఖ	గనులు, భూగర్భశాఖ	పరిశ్రమల శాఖ	విద్యాశాఖ	మొత్తం
2,29,900	1,32,000	81,200	46,000	30,000	10,000	**35,23,300**

విద్యుదుత్పత్తిపై ముందస్తు ప్రణాళిక ఉండాలి

జెన్‌కో డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి



ఉత్పత్తి తీరును పరిశీలిస్తున్న రాజశేఖర్ రెడ్డి

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తి కోసం ముందస్తు ప్రణాళిక ఉండాలని టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్) వై.రాజశేఖర్ రెడ్డి అన్నారు. పాల్వంచలోని కేటీపీఎస్ 5, 6వ దశల కర్మాగారంలో సోమవారం ఆయన డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లక్ష్మణ్, జనరేషన్ సీఈ పి.రత్నాకర్‌తో కలిసి కోల్ ప్లాంట్, వ్యాగన్ టిప్లర్, బీఓబీఆర్‌లో పర్యటించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్లకు బదిలీ పాలసీ రూపొందించాలని పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ల నాయకులు డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్యకు వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులు భర్తీ చేయాలని, కేటీపీఎస్‌లో నూతన కర్మాగారం నిర్మించాలని కోరారు.

క్లుప్తంగా

బౌద్ధక్షేత్రంలో పాముల భయం


పాముల కోసం గాలిస్తున్న సిబ్బంది

నేలకొండపల్లి: దక్షిణ భారతదేశంలో కెల్లా అతిపెద్దదైన మండల కేంద్రంలోని బౌద్ధక్షేత్రంను తిలకించేందుకు సోమవారం పలువురు పర్యాటకులు రాగా పాములు కనిపించగడంతో పరుగులు తీశా రు. క్షేత్రంపై నిర్వహణపై అధికారుల పట్టింపు కరువై ఆవరణ అంతా పిచ్చిచెట్లు పెరిగాయి. దీంతో ఫొటోషూట్ కోసం వచ్చిన ఇద్దరితో పాటు పలువురు పర్యాటకులకు పాలములు కనిపించడంతో ఆందోళనగా పరుగులు పెట్టారు. దీంతో అక్కడి సిబ్బంది అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ డానియేల్‌కు సమాచారం ఇవ్వగా ఆయన ఖమ్మం నుంచి పాములు పట్టే వారిని పిలిపించడంతో వారు స్టోర్ రూమ్‌లో రెండు పాములను బంధించారు. అధికారులు ఇకనైనా బౌద్ధక్షేత్రం పరిసరాలను శుభ్రం చేయించాలని పలువురు కోరుతున్నారు.

పోర్చుగల్‌లో ఉపాధి అవకాశాలు

ఖమ్మం రాపర్తినగర్: పోర్చుగల్‌లో ఉపాధి అవకాశాలు ఉన్నందున ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఎన్.మాధవి సూచించారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ద్వారా పోర్చుగల్‌లో హోటల్ మేనేజ్‌మెంట్, హౌస్ కీపర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్పా థెరపీ, ఈవెంట్ కోఆర్డినేటర్లుగా అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. 21–40 ఏళ్ల లోపు వయస్సు, ఎంపిక చేసుకున్న రంగంలో సరైన విద్యార్హత, ఐదేళ్ల అనుభవం కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఆసక్తి, అర్హత గల వారు దరఖాస్తు వివరాల కోసం 94400 52592, 94400 49937, 94400 51452 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

‘దోచుకోవడానికే పని గంటల పెంపు’

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే లేబర్ చట్టాలను కోడ్ల పేరిట కుదించి కార్మిక హక్కులపై దాడి చేస్తోందని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు పేర్కొన్నారు. దీనికి తోడు పని గంటలు పెంచడం మేడే పోరాట ఫలాన్ని పాతి పెట్టడమేనని తెలిపారు. కార్పొరేట్ వర్గాలు, పెట్టుబడిదారుల లాభాల కోసం వేతన జీవుల శ్రమను అదనంగా దోచుకోవడానికి ఈ విధానాన్ని తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ బాటలో తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు పయనిస్తున్నాయని విమర్శించారు. ఇకనైనా పని గంటల పెంపు జీఓను వెనక్కు తీసుకోవాలని రంగారావు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఏదులాపురం సొసైటీకి పర్సన్ ఇన్‌చార్జ్

ఖమ్మంరూరల్: మండలంలోని ఏదులాపురం ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘానికి పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించాలని సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సొసైటీ చైర్మన్ కొందరు రైతుల పేరిట రుణాలు తీసుకున్నారని, ఆ రుణాలు చెల్లించాలంటూ తమకు నోటీసులు వస్తున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ‘సాక్షి’లో వరుస కథనాలు వచ్చిన విషయం విదితమే. కాగా, రైతుల ఫిర్యాదుతో జిల్లా సహకార శాఖాధికారి విచారణకు ఆదేశించగా సొసైటీల అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఉష్రశీ ఇరువర్గాలను విచారించారు. ఆపై తుది నివేదికను రాష్ట్ర సహకార శాఖ ఉన్నతాధికారులకు సమర్పించారు. దీంతో నాలుగు నెలలు పాటు లేదా సొసైటీ ఎన్నికలు నిర్వహించే వరకు పర్సన్ ఇన్‌చార్జ్‌ను నియమించాలని జిల్లా సహకార శాఖ అధికారిని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

మోటాపురంలో చోరీ

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన చావా శేఖర్‌రావు కుటుంబ సభ్యులు ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి ఖమ్మం వెళ్లారు. దీంతో అర్ధరాత్రి వచ్చిన దుండగులు ఇంటి తలుపులు, ఆపై బీరువాను ధ్వంసం చేశారు. బీరువాలో ఉన్న రూ.50 వేల నగదు, దాదాపు రెండు తులాల బంగారం, అరకేజీ వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. ఈ విషయమై సోమవారం అందిన ఫిర్యాదుతో పోలీసులు విచారణ ప్రారంభించారు.

రామయ్య భూముల్లో అక్రమంగా నిర్మాణం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన భూముల ఆక్రమణ కొనసాగుతోంది. పట్టణ సరిహద్దులోని ఏపీ పురుషోత్తపట్నంలో ఉన్న ఆలయ భూముల్లో కొందరు ఆక్రమణదారులు సోమవారం ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ ఉద్యోగులు వెళ్లి అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ మాట్లాడుతూ ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు 889.50 ఎకరాల భూములను దేవస్థానానికి అప్పగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463


పొలంలో డీఏపీ చల్లుతున్న రైతులు


నారు మడిని సిద్ధం చేస్తున్న రైతు


గడ్డి మందు కొడుతున్న దృశ్యం

ముందుకు సాగుతున్నారు..

జిల్లా అంతటా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. ఇప్పటికే పత్తి గింజలు నాటిన రైతులు మొక్కలకు యూరియా, డీఏపీ వంటి మందులను పిచికారీ చేస్తున్నారు. మరోవైపు కూలీలతో కలుపు తీయిస్తున్నారు. అలాగే, వరి నాట్లు వేసే సమయం సమీపిస్తుండడంతో నారు సిద్ధం చేసుకుంటున్నారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

అంగన్‌వాడీల్లో ఖాళీలు..

ఖాళీలతో సతమతం..
- అంగన్‌వాడీల్లో భర్తీకి నోచుకోని టీచర్, హెల్పర్ పోస్టులు
- కుంటుపడుతున్న పర్యవేక్షణ, నెరవేరని ప్రభుత్వ లక్ష్యాలు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల కొరత వేధిస్తోంది. దాదాపు మూడో వంతు హెల్పర్ పోస్టులు, పెద్దసంఖ్యలో టీచర్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ప్రభుత్వ ఆశయాలు నెరవేరడం లేదు. కేంద్రాల ద్వారా చిన్నారులకు ప్రాథమిక విద్య, పౌష్టికాహారం పంపిణీ, గర్భిణులు, బాలింతలకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సేవలకు విఘాతం ఏర్పడుతోంది.

సేవలకు ఆటంకం

జిల్లాలో మొత్తం 1,840 అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 1,725 మందే విధుల్లో ఉన్నారు. ఇంకా 115 టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇక హెల్పర్ల పోస్టులు సైతం భారీగా ఖాళీ ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. మొత్తం 1,840 పోస్టులకు గాను 1,224 మందే మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. ఫలితంగా 616 హెల్పర్ల పోస్టులు ఖాళీగా ఉండడం అంగన్‌వాడీ కేంద్రాల పనితీరుపై ప్రభావాన్ని చూపుతోంది.

పర్యవేక్షణకు గండి

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు తొలి పాఠశాలలుగా నిలుస్తాయి. వీరితో పాటు గర్భిణులు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ సలహాలు అందిస్తారు. అయితే టీచర్లు, హెల్పర్ల కొరతతో కీలక సేవలు సాఫీగా సాగడం లేదు. సరిపడా సిబ్బంది లేక చిన్నారులపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో విద్యాబోధన అందడం లేదు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్య పరీక్షలు, అవగాహనా కార్యక్రమాలకూ సైతం ఆటంకాలు ఏర్పడుతున్నాయి.

లక్ష్యసాధనలో వెనుకంజ

బాలింతలు, గర్భిణులతో పాటు చిన్నారుల ఆరోగ్యం, అభివృద్ధికి ప్రభుత్వం అంగన్‌వాడీ వ్యవస్థను ఒక కీలకమైన సాధనంగా భావిస్తోంది. పోషకాహార లోపాన్ని తగ్గించడం, శిశు మరణాల రేటును నియంత్రించడం, చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించడం వంటి అనేక లక్ష్యాలను నిర్దేశించుకుంది. అయితే జిల్లాలో టీచర్లు, హెల్పర్ల ఖాళీల కారణంగా ఈ లక్ష్యాలను చేరడం ప్రభుత్వానికి సవాల్‌గా మారుతోంది. ఇకనైనా ఖాళీలను భర్తీ చేయకుంటే జిల్లాలో ప్రజారోగ్యం, శిశు సంక్షేమంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందనే భావన వ్యక్తమవుతోంది.

క్లస్టర్ల వారీగా అంగన్‌వాడీ టీచర్ల పోస్టులు మంజూరు, ప్రస్తుతం ఉన్న ఉద్యోగులు

ప్రాజెక్ట్	మంజూరు పోస్టులు		విధులు నిర్వర్తిస్తున్న వారు		ఖాళీలు	
	టీచర్	హెల్పర్	టీచర్	హెల్పర్	టీచర్	హెల్పర్
కల్లూరు	275	275	255	168	20	107
కామేపల్లి	276	276	263	156	13	120
ఖమ్మంరూరల్	280	280	261	162	19	118
ఖమ్మం అర్బన్	286	286	275	249	11	37
మధిర	282	282	253	193	29	89
సత్తుపల్లి	190	190	172	148	18	42
తిరుమలాయపాలెం	251	251	246	148	05	103
మొత్తం	1,840	1,840	1,725	1,224	115	616

అడ్తీ లైసెన్సుల జారీకి కసరత్తు

- వారసత్వ, భాగస్వాములకు అవకాశం
- 70 లైసెన్సుల కోసం దరఖాస్తులు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో అడ్తీదారులకు నూతనంగా లైసెన్సుల జారీపై మార్కెట్ కమిటీ దృష్టి సారించింది. లైసెన్సు కలిగిన అడ్తీదారుల్లో కొందరు మరణించగా, ఇంకొన్ని సందర్భాల్లో భాగస్వామ్యంగా ఉన్న వారే కాక లైసెన్సులు విరమించుకున్న వారి స్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వనున్నారు. పంట ఉత్పత్తుల క్రయ, విక్రయాల్లో పారదర్శకతను పెంచడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మార్కెట్ యంత్రాంగం చెబుతోంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో 450 మంది కమీషన్ వ్యాపారుల(అడ్తీదారులు)కు లైసెన్సు ఉండగా, ఇందులో 47 లైసెన్సులు భాగస్వామ్యం, వారసత్వంలో కొనసాగుతున్నాయి. వీటిని క్రమబద్ధీకరించేందుకు తీర్మానం చేసి రాష్ట్ర మార్కెటింగ్ శాఖకు లేఖ రాశారు. లైసెన్స్ కోసం వ్యాపారులు స్థాయి ఆధారంగా రూ.లక్ష నుంచి రూ.2లక్షల మేర బ్యాంకు డిపాజిట్లు, ఎన్ఎస్‌సీ బాండ్లు కలిగి ఉండాల్సి ఉంటుంది.

వ్యాపారం పెరుగుతుండడంతో...

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఏటేటా పంట ఉత్పత్తుల విక్రయాలు పెరుగుతున్నాయి. రెండేళ్లుగా తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి తేజ రకం మిర్చిని రైతులు తీసుకొస్తున్నారు. సీజన్‌లో నిత్యం లక్ష బస్తాల వరకు వస్తుండగా, లైసెన్సు లేని వారు వ్యాపారులుగా, కమీషన్ వ్యాపారులుగా తిరుగుతూ పంట కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ కారణంగా అనేక సందర్భాల్లో సమస్యలు తలెత్తడమే కాక మార్కెట్ ఆదాయాన్ని నష్టపోతోంది. ఈ నేపథ్యాన తమకు లైసెన్సులు ఇస్తే ఉపాధి పొందుతామని 70మంది దరఖాస్తు చేసుకోవడంతో జారీకి నిర్ణయించారు.

అటవీ ప్లాంటేషన్‌లో సాగుకు యత్నం

అడ్డుకున్న ఫారెస్టు అధికారులు


పోడుదారులను అడ్డుకుంటున్న ఉద్యోగులు

కారేపల్లి: మండలంలోని మాణిక్యారం–ఎర్రబోడు అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు వేసిన ప్లాంటేషన్‌లో సాగుకు యత్నించిన వారిని ఉద్యోగులు సోమవారం అడ్డుకున్నారు. దీంతో ఉద్యోగులు – పోడుదారులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈసందర్భంగా పోడుదారులు మాట్లాడుతూ ఏళ్లుగా తాము ఇక్కడ వ్యవసాయం చేసుకుంటుండగా, రెండేళ్ల క్రితం అధికారులు ప్రత్యామ్నాయంగా భూమిఇస్తామని నమ్మించి ప్లాంటేషన్‌వేశారని తెలిపారు.ఇప్పుడు దాటవేత ధోరణి అవలంబిస్తుండడంతో కుటుంబపోషణ భారమై సాగుకు సిద్ధమయ్యాయని చెప్పారు. కాగా, ఎఫ్‌డీఓ వెంకన్న చేరుకుని రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని చెప్పడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఎఫ్ఆర్ఓ ప్రదూస్, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పులు సరిచేసుకోకపోతే కాంగ్రెస్‌కు అధోగతే

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని


మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన నాయకులు

కొణిజర్ల: జైళ్లలో ఉండాల్సిన వారు అసెంబ్లీ, పార్లమెంట్‌లో ఉంటుండగా.. చట్టసభల్లో ఉండాల్సిన మేధావులు రోడ్డుపై ఉంటున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. కొణిజర్ల మండలం మండలం తనికెళ్లలో సోమవారం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను మోయడమే తమ పని కాదని కూనంనేని వెల్లడించారు. బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాల వల్లే కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చామని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా కూడా ఇందిరమ్మ ఇల్లు, తదితర అంశాల్లో పేదలను విస్మరిస్తోందని ఆరోపించారు. ఇకనైనా పార్టీ తీరు మార్చుకోకపోతే అధోగతి ఎదురవుతుందని తెలిపారు. కాగా, బీజేపీకి మతం తప్ప వేరే సిద్ధాంతం లేకపోవడంతో, హిందూ మతం, రాముడిని అడ్డం పెట్టుకుని ఓట్ల రాజకీయం చేస్తోందని కూనంనేని ఆరోపించారు. పేదలకు సాయం చేయకపోగా మతాల మధ్య చిచ్చు పెట్టి పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. అంతేకాక ఆపరేషన్ కగార్ పేరుతో ఉద్యమకారులను పొట్టన బెట్టుకుంటున్నారని తెలిపారు. సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు మాట్లాడుతూ డిసెంబర్ 26న సీపీఐ శత జయంతి ఉత్సవాలను లక్ష మంది కార్యకర్తలతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండిసురేష్, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రా బాబు, దొండపాటి రమేష్, తాటివెంకటేశ్వర్లు, కొండపర్తి గోవిందరావు, స్వర్ణ రమేష్, కంపసాటి వెంకన్న, యాసా వెంకటేశ్వరరావు, తాటి నిర్మల, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, పీవీరావు, వేములకొండ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కసాయి తల్లికి జీవిత ఖైదు

- మామతో సంబంధాన్ని గుర్తించిందని బిడ్డను హత్య చేసిన తల్లి
- 2022 నాటి కేసులో ఇద్దరికీ జీవిత ఖైదు

సత్తుపల్లిటౌన్: వావివరుసలు మరిచి భర్త తండ్రితో వివాహేతర సంబంధం పెట్టుకున్న మహిళ.. తమ వ్యవహారాన్ని కుమార్తె గమనించిందని హత్య చేసింది. ఆపై అనారోగ్యంతో మృతి చెందినట్లు చిత్రీకరించినా భర్త అనుమానంతో విషయం బయటపడింది. ఈ కేసులో నిందితులిద్దరికీ జీవితఖైదు విధిస్తూ సత్తుపల్లి ఆరో అదనపు జిల్లా జడ్జి మారగాని శ్రీనివాస్ సోమవారం తీర్పు వెలువరించారు. బోనకల్ కు చెందిన పాలెపు సునీత తన మామ(భర్త తండ్రి) నర్సింహారావుతో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ట్రాలీ డ్రైవర్‌గా పనిచేస్తున్న భర్త హరికృష్ణ 2022 ఫిబ్రవరి 9న బయటకు వెళ్లగా ఆయన భార్య సునీత, తండ్రి నర్సింహారావు కలిశారు. ఈ విషయాన్ని అప్పుడు 11ఏళ్ల సునీత పెద్దకుమార్తె చూడడంతో ఆమె మెడకు వైరు బిగించి హతమార్చారు. ఆపై భర్త హరికృష్ణకు ఫోన్ చేసి కుమార్తె ఆరోగ్యం బాగా లేదని చెబుతూ 108లో ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా ఆమె చనిపోయిందని వైద్యులు ధ్రు వీకరించారు. అయితే, హరికృష్ణ కూతురు మెడపై కమిలినట్లు ఉండడంతో బోనకల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈక్రమాన దర్యాప్తు చేపట్టిన పోలీ సులు సునీత, నర్సింహారావును విచారించగా అసలు విషయం బయటపడడంతో కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో వీరిద్దరిపై నేరం రుజువు కాగా జీవితఖైదు విధిస్తూ న్యాయమూర్తి శ్రీనివాస్ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు ప్రాసిక్యూటర్ అబ్దుల్ బాషా వాదించగా, కేసు విచారణలో కీలకంగా వ్యవహరించిన సీఐ మురళి, ఎస్సై కవిత, సిబ్బంది బి.అరవింద్, శ్రీకాంత్‌ను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

ఆర్డర్లు లేవని కొనుగోళ్లకు బ్రేక్

- మిర్చి జెండాపాట పూర్తయ్యాక వెళ్లిపోయిన వ్యాపారులు
- ఆర్‌డీకి అవకాశం కల్పించాలని కొత్త రాగం

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. రోజుమాదిరిగానే మిర్చి కొనుగోళ్లకు జెండాపాట నిర్వహించగా.. ధర నిర్ణయించాక వ్యాపారులు తమకు సరైన ఆర్డర్లు లేవని వెనక్కి వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. దీంతో చాంబర్ ప్రతినిధులతో పాలకవర్గం, అధికారులు చర్చించినా ఫలితం దక్కలేదు.

800 బస్తాల సరుకు.. శాంపిళ్లు

రోజుమాదిరిగానే వివిధ ప్రాంతాల రైతులు మిర్చి అమ్మకానికి మార్కెట్‌కు వచ్చారు. కోల్డ్ స్టోరేజీల నుంచి 3,494 బస్తాలకు సంబంధించిన 76శాంపిళ్లు, గ్రామాల నుంచి 800 బస్తాల మిర్చి విక్రయానికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఉదయం 7–30గంటలకు జెండా పాట నిర్వహించిన వ్యాపారులు ధర కూడా నిర్ణయించారు. ఆతర్వాత ఆర్డర్లు లేనందున తాము కొనుగోలు చేయలేమంటూ వెనకడుగు వేశారు. దీంతో మార్కెట్ చైర్మన్, వైస్‌చైర్మన్లు యరగర్ల హన్మంతరావు, తల్లాడ రమేష్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎం.ఏ.అలీం, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ చేరుకుని చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు మాటేటి నాగేశ్వరరావు, యడ్లపల్లి సతీష్, దిరిశాల చిన్న వెంకటేశ్వర్లు, ముత్యం ఉప్పల్‌రావును పిలిపించి మిర్చి కొనుగోలు చేయాలని సూచించారు. కానీ జాతీయంగా, అంతర్జాతీయంగా మిర్చి ఆర్డర్లు సక్రమంగా లేనందున కొనుగోళ్లు నిలిపివేశామని బదులిచ్చారు. అంతేకాక తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పినా, ఎలాంటి నిర్ణయం వెలువరించకపోవడంతో సోమవారం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు జరగలేదు. ఫలితంగా అమ్మకానికి తీసుకొచ్చిన మిర్చి బస్తాలను మార్కెట్ షెడ్లలోనే నిల్వ చేశారు.

బిల్లుల్లో రేటు తగ్గింపునకు పట్టు

జాతీయ, అంతర్జాతీయంగా మిర్చికి డిమాండ్ లేకపోవడంతో నానాటికీ ధర పడిపోతోంది. గతంలో క్వింటాకు రూ.22 వేల వరకు పలికిన ధర ఇప్పుడు రూ.13 వేలు కూడా పలకడం లేదు. ఈనేపథ్యాన వ్యాపారులు కొనుగోళ్లకు వెనుకంజ వేస్తున్నారు. ఒకవేళ కొనుగోలు చేసినా ఆర్‌డీ(రేటు డిడక్షన్)కు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. అంటే నిర్ణయించిన ధరకే కొనుగోలు చేసి అంతే మొత్తంలో రైతులకు చెల్లిస్తారు. కానీ బిల్లు మాత్రం తక్కువగా నమోదు చేయాలని వ్యాపారులు కోరుతుండడం గమనార్హం. ఇలా చేస్తే ప్రభుత్వం, మార్కెట్ కమిటీకి వచ్చే పనుల్లో కోత పడనుంది. దీనికి పాలకవర్గం, అధికారులు ససేమిరా అన్నట్లు తెలిసింది. కాగా, మిర్చి కొనుగోళ్ల నిలిపివేత, ఆర్‌డీ వ్యవహారాన్ని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అయితే మంత్రి, ఉన్నతాధికారులు మిర్చి కొనుగోళ్లు యథాతథంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

ప్రతీ మండలంలో ‘సమర శంఖారావం’

డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, గిడ్డంగుల సంస్థ చైర్మన్ నాగేశ్వరరావు


మాట్లాడుతున్న దుర్గాప్రసాద్, పక్కన రాయల, నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించామని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. ఖమ్మంలోని పార్టీ జిల్లా కార్యాలయం సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటడం ఖాయమన్నారు. అయితే, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సీఎం రేవంత్‌రెడ్డి సూచనలతో జిల్లాలో ముందుగానే స్థానిక సంస్థల ఎన్నికల శంఖారావం సమావేశాలు ప్రారంభిస్తున్నట్లు తెలిపా రు. ఎన్నికలు ఎప్పుడూ నిర్వహించిన సమర్థవంతంగా ఎదుర్కొనేలా పార్టీ శ్రేణులను సిద్ధం చేయడమే ఈ సమావేశాల లక్ష్యమని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన 19 నెలల్లో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో పరుగులు పెడుతున్నందున ప్రభుత్వ పథకాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాగా, సత్తుపల్లి నియోజకవర్గం వేంసూరు మండలం నుండి సమర శంఖారావం సమావేశాలు ప్రారంభమవుతాయని, ప్రతీ మండలంలోని ఒక గ్రామంలో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. ఇదే సమయాన పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుండి అన్ని కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని దుర్గాప్రసాద్, నాగేశ్వరరావు వెల్లడించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణగౌడ్, నాయకులు దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్‌గౌడ్, సీతారాములు, వేజెండ్ల సాయికుమార్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వాసులకు డాక్టరేట్లు


డాక్టరేట్ అందుకున్న తులసీరామ్


బానోత్ సుజాత

తల్లాడ/రఘునాథపాలెం/ఖమ్మం సహకారనగర్: తల్లాడ మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన తులసీరామ్ కాకతీయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. నారాయణపురం గ్రామంలోని సరికొండ సాంబశివరాజు – జ్యోతి దంపతుల కుమారుడైన తులసీ రామ్ గ్రామీణ మార్కెట్లలో డిజిటల్ చెల్లింపుల విధానాలపై అధ్యయనం చేసి పరిశోధనాత్మక పత్రం సమర్పించగా డాక్టరేట్ లభించింది. అలాగే, రఘునాథపాలెం మండలంలోని పంగిడికి చెందిన అజ్మీరా సుజాత కేయూ స్నాతకోత్సవంలో డాక్టరేట్ స్వీకరించింది. సీనియర్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య పర్యవేక్షణలో ఆమె ‘తెలంగాణ బంజారా గేయాలు – జీవన చిత్రణ’ అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక పత్రానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా సుజాతను గ్రామ మాజీ సర్పంచ్ బానోతు మంగీలాల్‌నాయక్, గ్రామస్తులు అభినందించారు. అంతేకాక ఖమ్మంకు చెందిన అద్దెపల్లి చరిత్ర రాజనీతిశాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకుంది. ఖమ్మం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఆమెను పలువురు అభినందించారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ డ్రైవర్


ప్రయాణికుడికి బ్యాగ్ అందజేస్తున్న ఉద్యోగులు

మధిర: ప్రయాణికుడు మరిచిపోయిన రూ.10లక్షల విలువైన సామగ్రి కలిగిన బ్యాగ్‌ను తిరిగి అప్పగించి మధిర ఆర్టీసీ డిపో బస్ డ్రైవర్ నిజాయితీ చాటుకున్నాడు. బీహెచ్ఈఎల్ నుంచి మధిరకు వస్తున్న సూపర్ లగ్జరీ బస్సులో బోనకల్ మండలం నారాయణపురానికి చెందిన సీహెచ్.హనుమంతరావు జేఎన్‌టీయూ వద్ద ఎక్కాడు. బోనకల్ క్రాస్ వద్ద ఆయన బ్యాగ్ మర్చిపోయి దిగాడు. డిపోకు వెళ్లాక బ్యాగ్‌ను గుర్తించిన డ్రైవర్ ఎ.వెంకటేశ్వర్లు అందులో పరిశీలించగా రూ.2వేల నగదుతో పాటు రూ.10లక్షల విలువైన బంగారు నెక్లెస్, గొలుసు, చెవిదిద్దులు, ఫోన్ ఉన్నాయి. సదరు ప్రయాణికుడికి సమాచారం ఇచ్చి బ్యాగ్‌ను ట్రాఫిక్ ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, కంట్రోలర్ కాలేషా సమక్షాన అందజేశారు. ఈసందర్భంగా డ్రైవర్ వెంకటేశ్వర్లుతో పాటు డీఎం డి.శంకర్‌రావు, ఉద్యోగులకు హనుమంతరావు కృతజ్ఞతలు తెలిపారు.